ఈ దొంగ వెధవ ప్రేమకథలు తప్ప డిటెక్టివు కథలు చదివినట్టు లేదు. పీకపోవడానికి సిగరెట్ పెట్టె అక్కర్లేదు. సిగరెట్ పీకచాలు. నాలుగు గంటకి అంతా లేచేరు.

టేప్ రికార్డరు పోయినట్టు వీళ్ళకితెలియాలంటే "బాసు" గారు రావాలి. "బాసు" రావాలి, "బాసు" రావాలి. భగవంతుడ్ని ప్రార్థన ప్రారంభించేను. ఇందాక మొక్కకుండానే కోరిక తీర్చిన దేవుడు ఈసారి మూడు గంటలు మెడిటేషను చేయించేడు.

అంతా భగవంతుడి లీల!

మొత్తానికి "బాసు" ప్రత్యక్షమయ్యేసరికి ఏడైంది. ఇందాక ఇతడు హోమియో చేస్తాడన్నాను కదూ. అది అబద్ధం కాదు కాని నిజం చెప్పాలంటే ఇతను స్టీలు ఫేక్టరీ ఒకటి పెట్టేడు. గిన్నెలు తయారీకి మెడిసన్ ఎందుకు చదివేడో అర్థం కాదు. ఇంత వరకు ఒక్క చెమ్చా కూడా తయారు చెయ్యలేదు.

వచ్చిన దగ్గర్నుంచి తను చెయ్యబోయే గిన్నెలూ, గ్లాసులూ బొమ్మలు గీసి చూపిస్తాడే తప్ప రికార్డరు సంగతి చెప్పడే. ఎప్పటికైనా చెప్పడా అని అతని పక్క కుర్చీలోనే కూర్చున్నాను.

కాఫీలు తాగుతున్నాడు.

సిగరెట్లు కాలుస్తున్నాడు.

రాత్రి పదైంది. అయినా రికార్డరు ఊసు లేదే! ఇంక ఈ వేళ ఈ దొంగతనం సంగతి తెలీదు కాబోలని, నిద్ర పోదావను కున్నంతలో ఆపద్బాంధవుడిలా వొచ్చేడు ఇందాకటి ఖద్దరు దొంగ.

ఓరి! నువ్వు మామూలు దొంగవికావురా. అసల్సిసలు చార్ సౌబీస్.

వాడ్ని వీళ్లెవరికీ తెలీనట్టుంది. వాడే యింట్రడ్యూస్ చేసుకున్నాడు. ఏదో పేర్లు చెప్పేడు కాని మరిచిపోయాను. వాడిది హైదరాబాదట. కథలు రాస్తాట్ట. టేప్ రికార్డర్లు కూడా కొట్టేస్తాడని అరవబోయి మానేశాను. మా సుందరమ్మ కథలంటే వెర్రిట. అప్పుడు ఆవిడ మొహం చూడండి 70 ఎం.ఎం.లో తప్ప ఫోటో తియ్యలేం. అంత పొంగిపోయింది.

అన్నట్టు యీ కవిగాడికి సంగీతం అంటే పిచ్చట. (దొంగతనం హాబీనా?)

దొంగకి కాఫీ యిచ్చేరు. మళ్ళీ అందరూ తాగేరు.

అదేదో సినీమాలో చెప్పినట్టు "ఎవరైనా వస్తే కాఫీ, రాకపోతే కాఫీ, పనుంటేకాఫీ, పన్లేకపోతే కాఫీ". జడ్జిగారి జీతం అంతా ఎలా అయిపోతోందో యిప్పుడర్థమైంది.

"మధ్యాహ్నం మూడింటికి వచ్చేడు. యివేళ యీఊర్లో బాల మురళీకృష్ణ కచేరి వుందిట. నిజంగా ప్రాణం ఉసూరు మంది. టేప్ రికార్డరు తెచ్చుకోలేదేనని. యీలోగా మిమ్మల్ని పలకరించు దావఁని మీ యింటికి వచ్చేను. తీరా యింతదూరం వస్తే మీరంతా నిద్రపోతున్నారు. టేబిలు మీద బ్రహ్మాండమైన టేప్ రికార్డుంది. చెప్పకుండా తీసుకెళ్తే ఏమనుకుంటారో ?....

శెబాష్. వీడండి చార్‌సౌబీస్. తను ఇల్లు వదిలే సరికి రికార్డును టేబిలుమీదే వుందంటాడేఁవిటి? కొంపదీసి దొంగ తనం నామీదకి రాదుకదా? కుర్చీ చివరికి జరిగి శ్రద్ధగా వింటున్నాను.

"బాలమురళీకృష్ణే జయించేడు. తరువాత క్షమాపణలు చెప్పుకోవచ్చని రికార్డరు తీసికెళ్ళేను. యిదిగో క్షమించండి. అడగకుండా తీసికెళ్ళినందుకు ...."

ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా ఉండాలనిపించక గదిలోకి వెళ్ళిపోయాను.

ఛీ ! ఛీ!! ఏం మనుషులు?

**(జ్యోతి, దీపావళి 10.11.1980)**

# డూటీ

**ఎం**త చెడిపోయిన ఆడదయినా పైట జార్చి పదిమందిలోనూ ఎవర్నీ రమ్మని అడగదు. ఈ సుశీలలూ, మేరీలు, సుల్తానాలు వీళ్ళంతా ప్రాస్టిట్యూట్స్. అయితే కేసులు మాత్రం అబద్ధం. ఇలాంటి కేసులు సంవత్సరానికి ఇన్ని పెట్టాలని పోలీసుల రూల్స్.

పర్సులో మాత్రమే పెట్టేది – అందరికీ, ఇచ్చేది – అయితే డబ్బు కాకపోతే.

"బూడిద" అనేసి కాఫీ కలపడానికి వంటింట్లోకి బైల్దేరేను.

మా చిన్నల్లుడు తుళ్ళిపడ్డాడు.

చిన్నది నవ్వబోయి దగ్గింది.

చిన్ని గాడు మాత్రం వాళ్ళ నాన్న మీదికి వంగి పర్సులోకి తొంగి చూస్తున్నాడు.

వెధవాతృతా వీడూను.

వట్టి ఫూల్ అంతా తండ్రి పోలిక.

నేను మళ్ళీ కాఫీ పట్టుకొచ్చేసరికి ఎటెన్షన్లో నిల్చున్న సైని కుల్లా నిల్చున్నారు అందరూ. అందరి చేతుల్లోనూ చిన్న చిన్న పొట్లాలున్నాయి. అవి ఏటం బాంబులన్నంత భయంగానూ, భద్రంగానూ పట్టుకున్నారు వాళ్ళు.

"అంచేత మీరు వీటిని ఏ పరిస్థితుల్లోనూ కింద పెట్ట కూడదు. మీ పర్సుల్లోనో, హేండు బేగుల్లోనో, పెట్టుకోండి. ఏమిటి చిన్నా నీ సందేహం? పర్సులేకపోతేనో అనా? అందుకే నువ్వు టెన్తు క్లాసు రెండేళ్ళు చదివేవు. రాగిదో, వెండిదో తావేజు చేయించుకుని చేతికి కట్టుకో" అంటున్నారు మావారు.

నేను కాఫీ ఆయనకిస్తూ "ఏమిటట్రా?" అన్నాను జనాంతికంగా.

"ఏంలేదు. నేను నీలాగా గొప్పవాణ్ణి కాను గదా మరి. ఏదో సామాన్య మానవుణ్ణి. అంచేత పాపం ఎవరో మహానుభావుడు విభూది ఇస్తేనూ... పిల్లలకిస్తున్నాను. అంతే" అయనే జవాబు చెప్పేరు.

ఈయనకీ పిచ్చి ఎప్పుడు పోతుందో? "అదేలెండి. రోడ్డు మీదుంటే రాయి. గుళ్ళో ఉంటే దేవుడు. నాలాంటి వాళ్ళిస్తే బూడిద. మహాత్ములు యిస్తే విభూది" అన్నాను.

"ఎవరి వెర్రి వాళ్ళకానందం" వేదాంతం వెళ్ళబుచ్చారు.

"మరే – పక్కవాళ్ళకి అనర్థం కానంత వరకు" నా ఉవాచ.

ఇదేదో మతకలహానికి దారితీస్తుందనుకున్న మా పిల్లలూ, అల్లుళ్ళూ అంతా లోపలికి జారేసేరు.

మత కలహం అయ్యేదో లేదో, కాని ఈలోగా నారాయణ రావు గారొచ్చేరు, "ఎప్పుడొచ్చేరు గురువుగారూ" అంటూ,

"ఏదీ... ఇప్పుడే... యింకా స్తానం (యిదీ అచ్చు తప్పు కాదు) అదీ చెయ్యలేదు. వొళ్ళంతా రోడ్డులా ఉంది..." నేను నారాయణ రావుగారికి కాఫీ తేవడానికి మళ్ళీ లోపలికి వెళ్ళేను. తిరిగి వచ్చేసరికి "రావే, అమ్ముదు దా... దా... (హమ్మయ్య. నా అవసరం పడిందన్నమాట) కూర్చో..."

నారాయణరావుగారికి కాఫీ యిచ్చేసి మరో కుర్చీలో కూల బడ్డాను.

"పాపం! మన నారాయణరావు గారికి ఏవో ప్రాబ్లమ్స్ ఉన్నాయట. ఆఫ్‌కోర్స్ లేనిదెవరికనుకో.... అయినా మన జ్యోతి ష్యుడు శాస్త్రి గార్కి ఓసారి కన్సల్టు చెయ్యమంటున్నాను. అదుగో అలా సుపీరియర్ నవ్వు మాత్రం నవ్వకు ... నాకు మహా చికాకు. ఏవో ఎవరి చాదస్తాలు వాళ్ళవి. నాకు లీవు లేదు కదా. అంచేత ఇదిగో ఈయన్ని నీకు అప్పగిస్తున్నాను. వీలైనంత వేగం అమలాపురం తీసికెళ్ళు.... నేనే వెళ్ళేవాణ్ణి కాని చూస్తు న్నావుగా, చచ్చిపోదామన్నా క్షణం తీరిక లేదు. మరింక నువ్వు వెళ్ళక తప్పదు. పైగా మీ ఫ్రెండు దగ్గర నాల్రోజులు సరదాగా ఉండిరావచ్చు...." సిగరెట్ల కోసం ఆగేరు.

నిజం చెప్పాలంటే అమలాపురం వెళ్ళడం నాకూ యిష్టమే. అక్కడ డాక్టర్లు సత్యవతిగారు, ఆవిడ అక్క అన్నపూర్ణమ్మ గారు నేనంటే ప్రాణం పెడతారు. అయితే ఆ ఊరు వెళ్ళాలని ఎంత కోరిక ఉన్నా ఆ ప్రయాణం తల్చుకుంటే అంత భయం.

ముళ్ళపూడో –ఎవరోగాని "అమలాపురం వెళ్ళడం కన్నా అమెరికా వెళ్ళడం సులవు" అన్నారు.

ట్రూత్ ఈజ్ మోర్ హ్యూమరస్ దేన్ ఏ జోక్.

ఆ ఊరు ఎట్నుంచి వెళ్ళాలన్నా బస్సు ఎక్కకతప్పదు. బస్సు ఇష్టంలేని వాళ్ళు పడవ ఎక్కవచ్చు.

నాకు బస్సు అంటే భయం. పడవ అంటే అసహ్యం

కాకపోతే మా సుగ్రీవుడుగారి ఆజ్ఞ అయింది. కాబట్టి కాదన డానికి వీల్లేదు.

బస్సు వెనకాల పరుగెత్తో, పడవముందు ఈత కొట్టో వెళ్ళాల్సిందే. కొంతలో కొంత పక్కన తోడు నారాయణ రావు గారు ఉంటారు కాబట్టి నయం. అతనిలో మంచి హ్యూమ రుంది. బిజినెస్‌మెన్ కాబట్టి జంతికలు మొదలు జెట్‌ప్లేన్ వరకూ ఏ అంశం మీదైనా సరే అనర్గళంగా మాట్లాడగలరు.

కనీసం ఊసుపోతుంది అనుకున్న నా ఆశ అరనిముషంలో ఆరిపోయింది. మావారి "పోనీ ఓ పని చెయ్యి. ముందు నువ్వు వెళ్ళి శాస్త్రిచేత చక్రాలూ, అంశలూ, దశలూ వగైరాలన్నీ కట్టించి ఉంచు. లేటైతే పాపం ఈయనకి ఇబ్బంది. రెండ్రోజులాగి, ఈయన వస్తారు. ఇద్దరూ కలిసి రావచ్చు" అన్న మాటల్తో.

ఈయనికి ఈ జబ్బు ఎప్పుడు పోతుందో? ఏదైనా పని చెయ్య మంటే ఇష్టం ఉన్నా లేకపోయినా చేస్తాం. కాని ఆ పని తను చెప్పిన పద్ధతిలోనే చెయ్యమంటే ఎలా?

ఏ బస్సు ఎక్కాలి? ఎక్కడ కాఫీ తాగాలి? రిక్షానా; ఆటో లోనా? ఎంతివ్వాలి? ఇవన్నీ డిక్టేట్ చేస్తే బుద్ధుడి క్కూడా బుర్ర పిచ్చెక్కి పోతుంది. అయినా తప్పదు.

ఆ మర్నాడు తెల్లవారుఝామున....

ఆ చలికి

పళ్ళు టైపు కొట్టేస్తున్నాయి.

వేళ్ళు వంకర్లు తిరిగిపోతున్నాయి.

అయినా మా హిట్లరుగారి ఆజ్ఞ మేరకు నేను సర్కారు ఎక్స్‌ప్రెస్ ఎక్కేను. "కుక్క పిల్లలా ఏమిటా చలి నువ్వూను? నిటా రుగా నిల్చో. ఏ చలీలేదు" అన్న దీవెనల్ని తలదాల్చి.

గుడివాడ వరకూ బాగానే ఉంది.

భీమవరం చేరేసరికి భయంకరమైన మబ్బు పట్టేసింది. కుండపోతగా వర్షం.

నేను దేవుడికి భయపడను.

దెయ్యం అంటే "కేర్‌ఔట్"

నేను భయపడేది

మొదటిది మా వారికి...

రెండు వర్షానికి...

"నువ్వు క్రితం జన్మలో హైడ్రోఫోబియాతో చచ్చిపోయి ఉంటావు" అని మావారి జోస్యం. క్రితం జన్మలో ఎలా చచ్చి పోయినా ఈ జన్మలో మాత్రం వర్షానికి చావడం నాకెంత మాత్రం ఇష్టం లేదు.

తణుకు చేరేం.

ట్రైన్ ఆగింది. కాబట్టి స్టేషనువచ్చిందని తెలిసింది. తప్ప ప్లాట్‌ఫారం గాని, స్టేషనుగాని ఏదీ కనిపించడం లేదు.

అంత చిక్కగా పడుతోంది వర్షం.

దిగక తప్పదు, దిగేను.

స్టేషన్లోకి పరుగెత్తేను.

మామూలుగా అయితే –ఈ వయస్సులో ఇంత భారీ కాయంతో అంత స్పీడుగా కాదు సరికదా అసలు పరిగెత్తేను.

ప్రాణభయానికి సిగ్గుండదేమో!

అసలే చిన్న స్టేషను ఆపైన వర్షం.

ప్యాసింజర్లు, కుక్కలూ, అమ్ముకునేవాళ్ళూ, అడుక్కునే వాళ్ళూ, అన్నిటితోనూ పరమఛండాలంగా ఉంది.

ఉంటే ఉంది. ఇప్పుడు నేను "తణుకు ప్లాట్‌ఫారం – దాని అందచందములు" మీద వ్యాసం రాస్తున్నానా ఏమిటి?

ఈ ఛండాలంలో ఉండడమా?

ఈ వర్షంలో వెళ్ళడమా?

ఉండనా? వెళ్ళనా?

వెళ్ళనా? ఉండనా?

వర్షానికి తోడైన గాలి వెళ్ళు, వెళ్లు అంటోంది. ఫ్లాట్ ఫార మ్మీద ఓ మూల ఒక ముష్టివాడు చాలా హాయిగా ఒక గోనె మీద కూర్చుని మరో గోనె కప్పుకొని సినిమా పాటలు పాడు కుంటున్నాడు. వాడు కూర్చున్న మూలకి ఎట్నుంచి వర్షం రాదు.

వాడ్ని చూసిన నాకు ఓ అరక్షణంలో సగం అసూయ లాంటిది కలిగింది.

ఇంతలో ఆటోవాళ్ళు, రిక్షావాళ్ళు నన్ను "బండి కావాలా అమ్మా" అని చుట్టేశారు.

"బస్‌స్టాండ్‌కి వస్తావా?" అడిగేను.

"వొస్తాను కానండి. ఇయ్యాళ బస్సుల్లేవండి"చావు కబురు చల్లగా చెప్పేడు.

ఆ వేళ పొద్దున ఎవరో కండక్టరు స్టూడెంటుని కొట్టేడో, స్టూడెంటు డ్రైవర్ని కొట్టాడో సరిగ్గా ఎవరికీ తెలీదుట. మొత్తానికి ఎవరో ఎవర్నో కొట్టేరట. అంచేత ఆ డిపోస్టాఫంతా లైట్నింగ్ స్ట్రైక్ చేస్తున్నారట.

లైట్నింగ్‌లు ఆకాశంలోనూ, భూమ్మీద ఒకేసారి జరిగితే ఎలా?

హే భగవాన్! నా చావు ఆఖరికి ఈ వర్షంలో రాసిపెట్టేవా?

ఇదేం పురాణకాలమా?

హే కృష్ణా! అనో ఓ రామా! అనో ఓ గావుకేక పెడితే వాన రెండు ముక్కలుగా చీలి నాకు తోవ ఇవ్వడానికి.

ఛీ! ఛీ! నా మొగుడు కాదు నా పాలిటి యముడు.

ఆడకూతుర్ని ఒక్కదాన్ని తోలీకపోతే, ఎవర్నైనా సాయం పంపకూడదా?

అంత పొదుపూ నా దగ్గరే వస్తుంది.

ఇప్పుడు నాకేమిటి దారి?

నా బుర్ర కొంచెం మందం.

లేకపోతే మావారి ఫ్రెండు మార్కండేయులు తణుకులోనే మేజిస్ట్రేటు అని అంతవరకూ తట్టకపోవడమేమిటి?

"తట్టడమేమిటి ఎదురుగా ఉన్న ఆటోలోకి గెంతడ మేమిటి"

"మేజిస్ట్రేటు కోర్టుకిపోనీ" అరిచేననే అనుకుంటాను.

"అయిదు రూపాయలౌతుంది"

"పోనీవయ్యా ముద్దయిపోతున్నాను"

అయిదు నిమిషాలు మూలిగి స్టార్టయింది. ఆటో అడుగు దూరంలో ఏం ఉందో కనిపించడం లేదు. దేన్నైనా గుద్దేస్తుందో ఏమిటో?

అందుకే మా నాన్నెప్పుడూ జేబులో అడ్రస్సు పెట్టుకునే వారు. ఇప్పుడింక నాకు దిక్కుమాలిన చావు.

మున్సిపాలిటీ దహనం.

నా శవాన్ని కుక్కలు పీక్కుతినడం చూడలేక కళ్ళు మూసు కున్నాను.

"దిగండమ్మా" అన్న ఆటోవాడి పిలుపుకే మళ్ళీ కళ్ళు విప్పేను.

వర్షానికి కోర్టు వరండాలు–రైల్వే ఫ్లాట్‌ఫాంలా ఆడ, మగ, వకీళ్లు, పార్టీలు, బంట్రోతులు, పోలీసులు – ఎక్కడా, ఒంటికాలు పెట్టడానిక్కూడా చోటులేదు.

కొంచెం దూరంగా

మరో వరండా మీద

పోలీసుల మధ్య పది, పదిహేను – కాలిపోయిన అగ్గి పుల్లల్లాంటి ఆడవాళ్ళు

జాతికే ఆడవాళ్లు

వాళ్ళలో స్త్రీత్వం లేదు,

రేకులు రాలిన పువ్వులు,

చౌకబారు ఫేసు పౌడరు

కరిగిపోయిన కాటుకలు – అద్దె చీరలు

నకిలీ నగలు

వాళ్ళని చూస్తే సానుభూతికి ముందు భయం.

మనలోని భయంకరత్వాన్ని చూసిన భయం ముందు కలుగు తోంది.

వాళ్ళెవరో ఎవర్నీ అడగక్కర్లేదు. ఓ బంట్రోతుని పిల్చి "మీ కోర్టు ఛాంబర్సు ఎక్కడ?" అనడిగేను.

నిలువెత్తు జలపాతంలా ఉన్న నేను నా అఘాయిత్యపు ప్రశ్నా – అతనికి నోట మాటరాలేదు.

ఈలోగా మరో జవాను వచ్చి ఛాంబర్సుకు తీసుకెళ్ళి కూర్చో బెట్టి, "అయ్యగారు అయిదు నిమిషాల్లో వస్తారని చెప్పమన్నారు" అని వెళ్ళిపోయాడు.

"బ్రతుకు జీవుడా" అనుకొని తడిబట్టలు మార్చేసి ఓ కుర్చీలో కూలబడ్డాను.

కోర్టులో జరిగేది నాకు కొంచెం కనిపిస్తుంది. అంతా వినిపిస్తోంది.

నువ్వేనా సుశీలవి? కోర్టు గుమాస్తా ప్రశ్న 'ఊ' ఒక ఆడమూలుగు.

"చూడమ్మా–నీ మీద కేసేవిటంటే నువ్వు మొన్న రాత్రి పద కొండు గంటలకి, మార్కెట్టు ముందు పబ్లిక్ రోడ్డుమీద పైట జారవిడిచి – బూతు పాటలు పాడుతూ రిక్షా రావుడ్ని సొలిసిట్ అంటే సంభోగానికి రమ్మని ఆహ్వానించేవుట – నేరం చేసేవా?

"చేసేను"

కొన్ని క్షణాల స్మశానాల్లో రాజ్యం చేసే భయంకర నిశ్శబ్దం.

"ముప్పై రూపాయలు జరిమానా – లేకపోతే మూడు వారాలు జెయిలు.

తరువాత మరో సుశీల.

ఇంకో సుబ్బలక్ష్మి

మరో సుగుణ

అందరూ నేరాలు ఒప్పేసుకుంటున్నారు. శిక్షలు పడిపోతూనే ఉన్నాయి.

"ఎప్పుడొచ్చేరు? ఎక్కడ్నించి? గురువుగారెలా ఉన్నారు? కాఫీ తీసుకోండి. ఈవేళ ఉండిపోండి. మా ఆవిడ సంతోషి స్తుంది. పిల్లలెలా ఉన్నారు?" జవాబుల కోసం ఆగకుండా ప్రశ్నలు వెయ్యడం అతని అలవాటు.

కాఫీ తాగుతూ సంగతంతా చెప్పి నన్నెలాగైనా అమలాపురం పంపమన్నాను.

దానికేం వర్షం తగ్గనీయండి. వెళ్దురుగాని అయితే గురువు గారికింకా ఈ జాతకాల పిచ్చి వదల్లేదన్నమాట" అంటూ ఓ గుమాస్తాకి చెప్పి పోలీసుల ద్వారా నాకో టాక్సీని ఏర్పాటు చెయ్యమన్నారు.

ఏదో మాట్లాడుతున్నా – నా ధ్యానమంతా ఆ కేసుల మీదే ఉంది. ఆ కేసులేవీ, నాకు నిజమనిపించలేదు.

ఎంత చెడిపోయిన ఆడదైనా పైటజార్చి పదిమందిలోనూ ఎవర్నీ రమ్మని అడగదు. ఆ మాటే బైటకనేశాను కూడా.

ఈ సుశీలలూ, మేరీలు, సుల్తానాలు వీళ్ళంతా ప్రాస్టిట్యూట్స్. అయితే ఆ కేసులు మాత్రం అబద్ధం. ఇలాంటి కేసులు సంవత్సరానికి యిన్ని పెట్టాలని పోలీసుల రూల్స్ అంచేత మూడ్నెల్లకోసారి ఇలాంటి ప్రాస్టిట్యూట్స్‌ని పట్టుకొని తప్పుడు కేసులు పెడుతూనే ఉంటారు. వాళ్ళు నేరం ఒప్పుకుంటేనే ఉంటారు. మేము శిక్షలు వేస్తూనే ఉంటాం. సూర్యుడు ఉదయిస్తూనే ఉంటాడు. అని ఆగేడు అతను.

"అబద్ధం కేసు అని నువ్వు నమ్మినప్పుడు ఎందుకు కొట్టే కూడదూ?" అడిగేను.

"మిలియన్ డాలర్ ప్రశ్న"

ఎందొక్కొట్టేకూడదూ? మహారాజులా కొట్టేయవచ్చు. కాని చూడండి బీనాదేవి గారు, ఈ కేసులు కొట్టేసినా – శిక్షవేసినా ఈ సుశీలలూ, సుగుణలు – వాళ్ళలా వొళ్ళమ్ముకొనే బతికేస్తారు.

"వాళ్ళమీద అవసరం అయితే తప్పుడు సాక్ష్యం చెప్పే ఈ రిక్షా రావుళ్ళు – వళ్లువంచి బతికేస్తారు".

నేను న్యాయాధికారినే, కాదన్ను

నేను అబద్ధమనుకున్నా – ముద్దాయి వొప్పేసుకున్న కేసు – వొగ్గేస్తే నా ఉద్యోగం ఊడిపోతుంది. అప్పుడు నన్నేం డూటీ జేసుకొని బతకమంటారు?

అయితే మీ కోర్టులో నమ్మిన నిజాన్ని....!"

**(1.12.1980)**

# పుణ్యభూమీ - కళ్ళు తెరు

## 1

"మిసిజ్ రాజమ్మా! హౌ దు యు దూ?" (శ్రీమతి రాజమ్మా! నువ్వు ఎలా ఉన్నావ్?)

"బాగానే వున్నాను." ('ఐయామ్ ఆల్ రైట్')

"మిసిజ్ రాజమ్మా! ఐ హావ్ కం ఫ్రం అమెరికా"

(శ్రీమతి రాజమ్మా! నేను అమెరికా నుండి వచ్చి యుంటిని.) ఐ రిప్రెజంట్ ది 'అమెరికన్ ఏజ్' వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ ఆఫ్ ఆవర్ వీక్లీస్, (అమెరికాలో అత్యంత ప్రసిద్ధి కెక్కిన వార పత్రిక–అమెరికన్ యుగమునకు నేను ప్రతినిధిని.)

"ఊ" (యెస్)

"ఐ హావ్ కమ్ టు మేక్ యు యాన్ ఆఫర్" (నేను నీకు ఒక ప్రతిపాదన యిచ్చుటకు వచ్చినాను.)

"ఏమిటది?" (వాటీజ్ దట్?)

## 2

ఆ చల్లని ఉదయం.

సూర్యుడు ఉదయిస్తూనే బంగారు లేసుతెర కప్పేడు ప్రపంచానికి.

ఆ ఇంట్లోంచి చూస్తే దడిమీద పాదు ఆ తెరలో ఆకుల్లా వుంది.

ఆ వెల్తుర్లో గడ్డిమేటు బంగారు దిబ్బలా ఉంది.

ఇంటి పక్కన ఆవు 'అంబా' అని ఎలుగెత్తి పలికింది.

ఇంటి ముందు కోడిపెట్ట రెక్కలు టప టప లాడించింది. ఆ గాలికి పిల్లలు దొర్లినట్టు పారిపోయాయి.

దూరంగా గాజులు గల గల లాడిస్తున్న ప్రౌఢ స్త్రీలా భారంగా పారుతోంది ఏరు.

ఆవలి గట్టు సరుగుడు తోట గంధర్వుల ఈలలా పాడుతోంది.

ఏట్లో తెరచాప నడిచి వస్తున్న తెలి మబ్బులా వుంది.

దూరాన నీలికొండ నిద్రలేవని పట్టపు రాణిలా వుంది.